నమస్తే తెలంగాణ
వికారాబాద్
హైదరాబాద్, గురువారం 1 మే 2025 VIKARABAD

## 146 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

### ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఇన్‌స్పెక్టర్లను బదిలీలు చేస్తూ.. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లు, జోన్లను, డివిజన్లను పునర్వ్యవస్థీకరిస్తూ.. నిర్ణయం తీసుకున్న తర్వాత ఈ బదిలీలు జరగడంతో పోలీస్ కమిషనరేట్‌ను ప్రక్షాళన చేసినట్లయింది. నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న 146 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. పునర్వ్యవస్థీకరణకు సంబంధించి బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో జోన్లు, డివిజన్లు, పీఎస్‌ల మార్పులతో పాటు బదిలీలకు సంబంధించి సీపీ నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ విభాగంతో పాటు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లను కూడా పెద్దఎత్తున బదిలీ చేయడం, ప్రతీ జోన్‌కు ఒక సైబర్ క్రైమ్ సెల్‌ను ఏర్పాటు చేసి.. వీటికి ఒక్కో ఇన్‌స్పెక్టర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా సైబర్ విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని నగర కమిషనర్ పేర్కొన్నారు.

## లక్ష్యం చేరుకోని ఎర్లీబర్డ్

### టార్గెట్ రూ.1000 కోట్లు.. వసూలైంది రూ.880 కోట్లే ..




**సిటీబ్యూరో** : జీహెచ్‌ఎంసీ ఎర్లీబర్డ్ పథకం ద్వారా రూ.1000 కోట్ల పన్ను వసూలు చేయాలన్న లక్ష్యాన్ని అధికారులు చేరుకోలేదు. ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఉంటుందని, ఈ ఎర్లీబర్డ్ స్కీం ఆఫర్‌ను ఇళ్లు, వ్యాపార సముదాయాల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని అధికారులు గడిచిన 30 రోజులుగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి వరకు బల్దియా రూ.880 కోట్ల మేర ఆదాయాన్ని సమకూర్చుకున్నది. చివరి రోజు ఒక్క రోజే రూ. 77 కోట్ల మేర ఆదాయం రావడం గమనార్హం. కాగా గతేడాది రూ. 831 కోట్ల ఆదాయాన్ని రాబట్టిన అధికారులు.. ఈ ఏడాది ఎర్లీబర్డ్‌లో అదనంగా రూ.50 కోట్ల మేర రాబట్టారు. అర్ధరాత్రి 12 గంటల వరకు జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఆఫీసులు, సిటిజన్ సర్వీస్ సెంటర్లు తెరిచి ఉంచారు. ఎర్లీబర్డ్ ఆదాయం గురువారం ఉదయం వరకు సమగ్రంగా వెల్లడవుతుందని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# ‘పది’లో నిరాశే..

బుధవారం ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రంగారెడ్డిలో 87.63 శాతం, వికారాబాద్‌లో 73.97 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో 31వ స్థానంలో రంగారెడ్డి నిలువగా.. వికారాబాద్ చివరి స్థానంలో నిలిచింది. గతేడాది రంగారెడ్డి 29లో ఉండగా.. ఈ ఏడాది రెండు స్థానాలకు దిగజారింది. గతేడాది మాదిరిగానే చివరి స్థానంలో నిలిచింది. సీఎం సొంత జిల్లాలో కూడా మెరుగుపడని పరిస్థితి నెలకొన్నది. ఈ ఫలితాలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లావాసులను నిరాశపరిచాయి. రెండేండ్లుగా ఫలితాలు సరిగా రాకున్నా విద్యా శాఖ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం విద్యాధికారుల నిర్లక్ష్యమేనని ప్రజలు పేర్కొంటున్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండి కూడా వారు బోధనపై కాకుండా ఇతరత్రా వ్యవహారాల్లో దృష్టి సారిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- రంగారెడ్డి/వికారాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ)

- 31వ స్థానంలో రంగారెడ్డి.. 33వ స్థానంలో వికారాబాద్
- రంగారెడ్డిలో 87.63 శాతం, వికారాబాద్‌లో 73.97 శాతం ఉత్తీర్ణత
- గతేడాది 29లో ఉండగా రెండు స్థానాలు తగ్గిన రంగారెడ్డి
- గతేడాది మాదిరిగానే చివరి స్థానంలో వికారాబాద్
- సీఎం సొంత జిల్లాలో మెరుగుపడని పరిస్థితి
- ఉమ్మడి జిల్లావాసులను నిరాశపరిచిన ఫలితాలు

### సత్తా చాటిన రెసిడెన్షియల్ పాఠశాలలు

జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులు ఈసారి సత్తా చాటారు. రెసిడెన్షియల్ పాఠశాలలతోపాటు ప్రభుత్వ పాఠశాలలు కలిపి 18 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. రాజేంద్రనగర్ బీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో 73 మంది పరీక్ష రాయగా, 73 మంది.. గండిపేట్‌లోని కస్తూర్బా పాఠశాలలో 38 మందికి 38 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇబ్రహీంపట్నం నల్లకంచ బాలికల పాఠశాలలో 80 మంది విద్యార్థినులకు 80 మంది.. గౌలిదొడ్డి రెసిడెన్షియల్ పాఠశాలలో కూడా 74 మందికి 74 మంది ఉత్తీర్ణత సాధించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కవాడిపల్లి పాఠశాలలో వంద శాతం.. బాటసింగారం ఉన్నత పాఠశాలలో 66 మందికి 66 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతోపాటు కల్వకుర్తి మజీద్‌పూర్, బండరావిరాల, కొౌకుంట్ల, ఎలిమినేడు, ఇబ్రహీంపట్నం బాలికల హైస్కూల్, బాలికల హైస్కూల్ మంచాల, జడ్పీఎచ్ఎస్ చెన్నారెడ్డిగూడ, జడ్పీహెచ్ఎస్ మేకగూడ, జడ్పీహెచ్ఎస్ బాలికల వెల్జాల్ తదితర పాఠశాలల్లో కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

రంగారెడ్డి, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి ఫలితాల్లో రంగారెడ్డిజిల్లాలో 87.63 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గతేడాది పది ఫలితాల్లో రంగారెడ్డిజిల్లా 29వస్థానంలో ఉండగా.. ఈ సంవత్సరం 31వ స్థానానికి దిగజారింది. జిల్లావ్యాప్తంగా 51,792 మంది పరీక్షలకు హాజరుగాగా.. బాలురు 23,281(86%), బాలికలు 22,105 (89.41%) మొత్తం 45,386 మంది ఉత్తీర్ణత సాధించారు. తలకొండపల్లి, మాడ్గుల, ఆమనగల్లు వంటి మండలాల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గింది. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పది మంది పరీక్షలు రాయగా.. ఒక్కరు., కడ్తాల్ మండలంలో 350 మందికి, కేవలం 181 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 30 మంది పరీక్ష రాయగా 8 మంది., ముద్విన్ పాఠశాలలో 40 మందికి ఆరుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం ఆశించిన మేర రాలేదు. దీంతో ఫలితాల్లో జిల్లా వెనుకబడింది.



వికారాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : బుధవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఈ ఏడాది కూడా చివరి స్థానం(33)తో సరిపెట్టుకుంది. వరుసగా మూడో ఏటా చివరి స్థానంలో నిలిచింది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో 65.10 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 73.97 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోలిస్తే కొంతమేర ఉత్తీర్ణత శాతం పెరిగింది. జిల్లావ్యాప్తంగా 12,846 మందికి 9502 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మరోవైపు పదో తరగతి ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. 6405 మంది బాలురు పరీక్షలకు హాజరుకాగా 4469 మంది ఉత్తీర్ణులుకాగా, బాలికలకు సంబంధించి 6441 మంది పరీక్షలకు హాజరుకాగా 5033 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 78.14 శాతం మంది ఉత్తీర్ణులుకాగా, 69.77 శాతం మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. జూన్ 3 నుంచి 13 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఫీజు చెల్లింపునకు ఈ నెల 17 వరకు గడువు ఇచ్చారు.

#### విద్యాశాఖ నిర్లక్ష్యం

సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో పది ఫలితాల్లో జిల్లా వెనుకబడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఏటా జిల్లా రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక తరగతులు అకాడమిక్ ప్రారంభం నుంచి షురూ చేస్తున్నామని చెప్పడమే తప్ప ప్రత్యేక పర్యవేక్షణ కరువైంది. గతేడాది కంటే ఉత్తీర్ణత శాతం పెరిగిందని చెప్పుకోవడం తప్ప అధికారులు పెద్దగా చేసిందేమీ లేదు. సర్కారు బడుల్లో డిసెంబర్ నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించినప్పటికీ ఫలితాలను మాత్రం రాబట్టలేకపోయారు. మొదటి నుంచి దృష్టి సారించకుండా కేవలం పరీక్షల సమయంలోనే ఉత్తీర్ణులయ్యేలా విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడంపై జిల్లా విద్యాశాఖ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై సంబంధిత అధికారుల ఆజమాయిషీ లేకుండా పోయింది. జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బోధనపై కంటే ఇతరత్రా రియల్ ఎస్టేట్, చిట్టీల వ్యాపారాలపైనే దృష్టి పెడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో 50 శాతం మేర కూడా ఫలితాలు రాబట్టలేకపోతుండడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించే ఉపాధ్యాయులున్నప్పటికీ వారి పట్టింపులేనితనంతో ఈ దుస్థితి నెలకొన్నదని ప్రజలు విమర్శిస్తున్నారు.



ఇబ్రహీంపూర్‌లో వడ్లు ఆరబోసిన దృశ్యం

# భయం.. భయం..

- అకాల వర్షంతో అన్నదాత ఆందోళన
- కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెడుతున్న ధాన్యం
- కేంద్రం ప్రారంభించి వారం రోజులైనా తూకం వేయని అధికారులు
- బిక్కుబిక్కుమంటూ రోజులు గడుపుతున్న రైతులు

పరిగి, ఏప్రిల్ 30 : అకాల వర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పరిగి మండలం ఇబ్రహీంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం రోజులైనా కొనుగోళ్లు ప్రారంభించకపోవడంపై రైతాంగం అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రం సమీపంలో రైతులు వడ్లను రోజూ ఆరబెట్టి, సాయంత్రానికి తాడిపత్రి, కవర్‌లు కప్పి పెడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వడ్లు వర్షానికి తడుస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం నుంచే వరి కోతలు ఊపందుకున్నాయి. రైతులు వడ్లను కొనుగోలు కేంద్రం వద్దే ఆరబోసినా, కొనుగోలు కోసం బస్తాలు ఇచ్చిన అధికారులు తూకాలు వేయడం లేదన్నారు. ఇబ్రహీంపూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా.. ఇప్పటివరకు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంపై రైతాంగం తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రోజుల తరబడి వడ్లు ఎండకు ఆరబోస్తున్నా ఇప్పటివరకు ఎందుకు కొనుగోలు చేయడం లేదని అంటున్నారు. గాలివాన వచ్చిందంటే తమ కష్టమంతా వృథా అవుతుందని వారు భయపడుతున్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోవడంపై డీసీఎంఎస్ పరిగి బ్రాంచ్ మేనేజర్ వెంకటయ్యను వివరణ కోరగా తేమ శాతం 13 ఉండాలని, ఇంకా వడ్లు ఆరకపోవడం వల్లే కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు.




ఆరబోసిన వడ్లను బస్తాలలోకి నింపుతున్న రైతు

# హామీలు గాలికి..!

- పరిగి మార్కెట్‌లో పనిచేయని వే బ్రిడ్జి
- అటకెక్కిన ప్లాట్‌ఫారాల నిర్మాణాలు
- అడ్రస్‌లేని అన్నదాతల అతిథి గృహం
- సంబంధిత రాష్ట్ర డైరెక్టర్ హామీ ఇచ్చి ఏడాది దాటినా అమలు కాని హామీలు
- ప్రతిపాదనలు పంపించినా ఆమోదం పొందని వైనం
- సదుపాయాల కల్పనకు చిల్లిగవ్వ ఇవ్వని సర్కారు



నిరుపయోగంగా ఉన్న వే బ్రిడ్జి



శిథిలావస్థకు చేరిన మార్కెట్ కమిటీ పాత కార్యాలయం

పరిగి, ఏప్రిల్ 30 : రాజకీయ నాయకులు చెబితే అమలయ్యేంత వరకు అపనమ్మకమే ఉంటుంది. కానీ ప్రభుత్వ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారంటే కొద్ది నెలల వ్యవధిలోనైనా అమలు జరుగుతుందన్నది వాస్తవం. ఏకంగా సంబంధిత శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఇచ్చిన హామీలు ఏడాది దాటినా కార్యరూపంలోకి రాలేదంటే పరిస్థితి ఎలా ఉన్నదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. 2024 జనవరి 27న వేరుశనగ రైతులు మద్దతు ధర విషయమై పరిగి మార్కెట్‌లో ఆందోళన చేపట్టి మార్కెట్ బంద్ నిర్వహించారు. దీంతో మరుసటి రోజు జనవరి 28న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి పరిగి మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు చెప్పిన ప్రతి అంశం పరిష్కారమయ్యేలా చూస్తామంటూ హామీ ఇచ్చారు. ప్రధానంగా రైతులకు తక్‌పట్టీలు ఇవ్వడం, రాత్రి సమయాల్లో మార్కెట్‌లో లైట్లు సరిగ్గా వేయించడం, రైతులు తీసుకువచ్చిన వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధర కల్పించడం, కమీషన్ నిబంధనల మేరకే తీసుకునేలా చర్యలు చేపడతామని డైరెక్టర్ చెప్పారు. అలాగే వృథాగా పడివున్న వే బ్రిడ్జికి వెంటనే మరమ్మతు చేయించి ఉపయోగంలోకి తీసుకువస్తామన్నారు. రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చే వ్యవసాయ ఉత్పత్తులు కింద పోసేందుకు వీలుగా ప్లాట్‌ఫారాల నిర్మాణాలు చేపడతామని చెప్పారు. ఇక్కడివరకు అంతా బాగున్నా 15 నెలలు దాటినా ఇప్పటి వరకు ఇందులో ఏ ఒక్క హామీ అమలు కాలేదు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారి ఇచ్చిన హామీల అమలు జరగకుంటే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

#### ఏర్పాటు చేసినప్పటి నుంచి వృథాగా వే బ్రిడ్జి


పరిగి మార్కెట్ యార్డులో రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా, ఈ వే బ్రిడ్జి ఏర్పాటైన తరువాత పనిచేయకపోవడం గమనార్హం. హైదరాబాద్‌లోని ఓ మార్కెట్‌లో ఉన్నటువంటి వే బ్రిడ్జిని తీసుకువచ్చి పరిగి మార్కెట్‌లో ఏర్పాటు చేశారు. ఉద్దేశం మంచిదే అయినా కనీసం పట్టుమని పది రోజులు సైతం పనిచేయని వే బ్రిడ్జి వల్ల ఎవరికీ ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. డైరెక్టర్ హామీతో వెంటనే మరమ్మతులు జరుగుతాయని ఆశించినా, ఇప్పటివరకు ఈ విషయంలో ఉలుకూపలుకూ కరువైంది. వే బ్రిడ్జి మరమ్మతుల కోసం రూ.2 లక్షలతో ప్రతిపాదనలు పంపించగా.. ఇప్పటివరకు ఆమోదం లభించలేదు. ఓపెన్ ప్లాట్‌ఫారాలు, 3 షెడ్లు, రెండు చోట్ల మరుగుదొడ్ల నిర్మాణం, కొత్తగా మార్కెట్ కార్యాలయ నిర్మాణానికి సంబంధించి రూ.3.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. ఇవి ప్రతిపాదనల దశలోనే ఉండడం గమనార్హం. వాటికి ఆమోదం లభించేదెపుడు, నిర్మాణమెపుడని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుండగా మార్కెట్ కమిటీ కార్యాలయం పాత భవనం నిర్మాణం చేపట్టిన దశాబ్దంన్నరలోనే పూర్తిగా పనికిరాకుండా పోయిందంటే నిర్మాణం ఎంత నాణ్యతగా చేపట్టారనేది తెలుస్తుంది. ప్రస్తుతం వృథాగా పడివున్న పాత మార్కెట్ కార్యాలయం స్థానంలో రైతులకు అతిథి గృహం నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. కొద్ది సంవత్సరాల క్రితమే కొత్త కార్యాలయం నిర్మాణం జరిగి ప్రస్తుతం ఉపయోగంలో ఉండగా, మరో నూతన కార్యాలయం నిర్మాణం కోసం ప్రతిపాదించడం గమనార్హం. మార్కెట్ యార్డులో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినా ప్రస్తుతం ఉపయోగంలో లేకుండాపోయాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో గోదాములు ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఈవీఎంల కోసం ఉపయోగించగా.. ఇప్పటివరకు గోదాములను తిరిగి ఇవ్వలేదు. గోదాముల పక్కనే గల మరుగుదొడ్లకు తాళం వేయబడి ఉన్నది. దీంతో మరుగుదొడ్లు సుమారు ఏడాదిన్నరగా నిరుపయోగంగా పడివున్నాయి. ఇదిలావుండగా రైతులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేకంగా నీటిశుద్ధి ప్లాంటు ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం పనిచేయడం లేదు. ఏది ఏమైనా గత 17 నెలల కాలంలో పరిగి మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డైరెక్టర్ ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టేందుకు, సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా మరుగుదొడ్లు

# నార్త్ సిటీ అభివృద్ధిపై మీనమేషాలు

- ప్రతిపాదనల పేరుతో ప్రభుత్వం కాలయాపన
- గందరగోళంగా ఎలివేటెడ్, మెట్రో ప్రాజెక్టులు
- ఇప్పటికీ పూర్తికాని మెట్రో డీపీఆర్, ఎలివేటెడ్ భూసేకరణ
- భూసేకరణపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత



సిటీబ్యూరో, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): నార్త్ సిటీ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది. ఆ ప్రాంతం తనకు రాజకీయ పునర్జన్మనిచ్చిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నీటి మూటలుగా మారుతున్నాయి. ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని అంటూనే రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. దాదాపు 30 లక్షలకు పైగా జనాభా ఉన్న నార్త్ సిటీ ప్రాంతానికి తీరని అన్యాయం చేసేలా ఎలివేటెడ్ డబుల్ డెక్కర్, మెట్రో విషయంలో ప్రతిపాదనలను సర్కారు తారుమారు చేస్తున్నది. ఒకవేళ ఆయా ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించకపోతే నార్త్ సిటీకి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటుకే ప్రమాదం పొంచి ఉంది.

#### ‘ఊహానగరం’పై ఉన్న ప్రేమ..

సీఎం రేవంత్ రెడ్డికి ‘ఊహానగరం’పై ఉన్న ప్రేమ... నార్త్ సిటీపై లేకుండా పోయింది. రాజకీయ పునర్జన్మనిచ్చిన ప్రాంతానికి అన్యాయం చేసేలా రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన ఎలివేటెడ్ కారిడార్, మెట్రో నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా నార్త్ సిటీ ప్రజల సుదీర్ఘ కాలంగా తీరని ఆకాంక్షగా ఎలివేటెడ్ కారిడార్, మెట్రో మిగిలిపోయేలా ఉంది. ఈ విషయంలో ఇప్పటికీ భూ సేకరణ పూర్తి చేయకపోగా, తాజాగా మెట్రో నిర్మాణంలోనూ డీపీఆర్ పూర్తిచేయకుండా కొర్రీలు పెడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఒకే పిల్లర్‌పై రెండు రవాణా వ్యవస్థలను తీర్చిదిద్దాలని ప్రతిపాదనలకు తిలోదకాలు వదిలే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. నిర్ణీత గడువులోగా డీపీఆర్ పూర్తి చేయకుండా, అదేవిధంగా జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గంలో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు భూసేకరణ విషయంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారు. కనీసం స్థానికుల ప్రతిపాదనలు కూడా పరిగణనలోకి తీసుకోకుండా గ్రామ సభల పేరిట కార్యకలాపాలు నిర్వహిస్తున్నారే తప్ప ... చిత్తశుద్ధితో ఆ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణకు సరైన నిర్ణయాన్ని తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఇలా ప్రాజెక్టుల ఆశయాలను నీరుగారేలా చేసి నార్త్ సిటీ ప్రాంతానికి కాంగ్రెస్ సర్కార్ తీరని అన్యాయం చేస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

#### ఎలివేటెడ్‌పై వీడని చిక్కుముడి..

గేట్ వే ఆఫ్ నార్త్ తెలంగాణగా పిలిచే ప్రాంతానికి మెరుగైన రవాణా సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు రక్షణ శాఖతో సంప్రదింపులు చేసింది. ఇందులో భాగంగా ప్రాజెక్టుకు అవసరమైన రక్షణ శాఖ భూములను తీసుకునేలా కేంద్రంతో అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ అనేకసార్లు సంప్రదింపులు కూడా చేశారు. కానీ కేంద్రం భూముల విషయంలో బీఆర్ఎస్ చేసిన ప్రతిపాదనలను బుట్ట దాఖలు చేసింది. అలా దాదాపు నాలుగున్నరేళ్ల పాటు తమకు రక్షణ శాఖ భూములు బదిలీ చేయాలని కోరిన ప్రయోజనం లేకుండా పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాత ప్రతిపాదనలకి మళ్లీ అంగీకారం తెలుపుతూ రక్షణ శాఖ భూముల బదలాయింపుపై చర్యలు తీసుకుంది. దీంతో ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ పడింది అనుకునేలోపే మరో తిరకాసుతో కొర్రీలు పెడుతూ భూ బదలాయింపును జాప్యం చేస్తున్నది. ఇలా ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తుండగా, భూ సేకరణ విషయంలో కూడా బాధితులతో సంప్రదింపులు చేయకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. దీంతో తమ వాదనలను పరిగణనలోకి తీసుకోని ప్రభుత్వానికి భూములు ఇచ్చేది లేదని, ప్రభుత్వం ప్రాజెక్టు వెడల్పు తగ్గిస్తే గాని భూములు ఇవ్వలేమని రాజీవ్ రహదారి స్థలాల జేఏసీ చెబుతున్నది. ఈ క్రమంలో ఎలివేటెడ్ కారిడార్ విషయంలో తమకు నష్టం జరగకుండా కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఇలా సామరస్యంగా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టును వివాదాస్పదం చేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి దూరం చేయాలని సర్కార్ ఉద్దేశంలో కనిపిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

#### చెరోదారిలో ఎలివేటెడ్, మెట్రో ప్రాజెక్టులు..

ఒకే ప్రాజెక్టు ద్వారా ఎలివేటెడ్, మెట్రో రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశారు. రెండు మార్గాల్లో 18 కి.మీ పొడవైన ఒకే పిల్లర్‌పై రెండు రవాణా వ్యవస్థలు ఏర్పాటు చేయడం వల్ల నిర్మాణ వ్యయం తగ్గడంతో పాటు, భూసేకరణ భారం కూడా తగ్గుతుంది. బృహత్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్‌కి ప్రణాళికలు రూపొందించింది. దీనికి అనుగుణంగానే నిర్మాణానికి ఏర్పాట్లు చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకమైన ఎలివేటెడ్ కారిడార్ విషయంలో కొర్రీలు పెడుతూ ప్రాజెక్టును రెండుగా విడదీసి నార్త్ సిటీ ప్రయోజనాలకు గండి కొట్టాలని భావిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. త్వరగా ఎలివేటెడ్ కారిడార్, మెట్రో పనులు పూర్తిచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# బస్సులు సరిపోతలేవు

- ప్రణాళిక లేకుండా మహాలక్ష్మి పథకం అమలుతో అవస్థలు
- గ్రేటర్‌లో రెండున్నర రెట్లు పెరిగిన ప్రయాణికులు
- కిక్కిరిసిపోతున్న బస్సులు, ఫుట్‌బోర్డు ప్రయాణం

**సిటీబ్యూరో** : ఒక ప్రణాళిక లేకుండా కాంగ్రెస్ సర్కార్ మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడంతో బస్సుల కొరతతో గ్రేటర్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడా బస్సులు లేకపోవడం, సమయానికి బస్సులు రాకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో బస్సుల సంఖ్య పెంచకపోవడం ఇప్పుడు ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. వచ్చే అరకొర బస్సుల్లోనే ప్రయాణికులు కిక్కిరిసిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కాగా, తక్షణ అవసరం దృష్ట్యా 200 బస్సులను గ్రేటర్‌కు అందించాలని గ్రేటర్ అధికారులు.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. కాగా ఇప్పటికే విద్యార్థులు, ప్రయాణికులు లక్ష సంతకాల ఉద్యమం చేసి బస్సుల సంఖ్య పెంచాలని అధికారులకు విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొత్తగా 200 బస్సులు కావాలని అధికారులు ప్రభుత్వాన్ని కోరారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికైనా నూతన బస్సులు వచ్చే సూచనలు కనిపించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



హైటెక్‌సిటీ ఇనార్బిట్‌మాల్ సమీపంలో బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల అవస్థలు

#### బస్సుల సంఖ్య పెంచాల్సిందే..!

గ్రేటర్‌లో ఉచిత బస్సు పథకం అమలుకు ముందు రోజుకు 11 లక్షల మంది ప్రయాణం చేసేవాళ్లు. ఇందులో మహిళా ప్రయాణికులు సుమారు 5 లక్షల దాకా ఉండేవాళ్లు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చాక బస్సుల్లో ఇప్పుడు రోజుకు సుమారు 24 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. ఇందులో 17 లక్షల మంది మహిళలే ఉండటం విశేషం. ఇంత ప్రయాణ భారం గ్రేటర్‌లో ఉన్న 2,600 బస్సులపైనే ఆధారపడి ఉంది. దీంతో ప్రతీ బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నది. ఈ క్రమంలో బస్సుల సంఖ్యను పెంచాల్సిందే అంటూ ప్రజలనుంచి నిత్యం ఆర్టీసీ అధికారులకు వినతులు వెల్లువెత్తుతున్నాయి.

#### టికెట్ల జారీ, డ్రైవింగ్ కత్తిమీద సామే..

ఈ క్రమంలో కండక్టర్లకు టికెట్లు జారీ చేయడం, ఆధార్ నంబర్లను సేకరించడం అనేది కత్తిమీద సాములాంటిదే. ఇదే క్రమంలో నగరంలో బస్సు నడపాలంటే ఎంతో ఓపిక ఉండాలి. నిత్యం రోడ్లపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతీ నాలు గు, ఆరు నిమిషాలకు ఓ స్టాప్ వస్తూనే ఉంటుంది. రద్దీ రోడ్లపై ఇలా ప్రతీ స్టాపు వద్ద ఆపుకుంటూ మళ్లీ డ్రైవ్ చేస్తూ గమ్య స్థానానికి చేరుకోవాల్సి ఉంటుంది. కొన్ని రూట్లల్లో రోడ్లు ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటాయి. మరికొన్ని రూట్లలో రోడ్లు చిన్నగా ఉంటా యి. వీటన్నింటి మధ్య డ్రైవర్ బస్సు నడుపుతూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తుంటారు. బస్సుల సంఖ్య పెంచితే ఇటు ప్రయాణికులకు అటు ఆర్టీసీ సిబ్బందికి క్షేమదాయకంగా ఉండనుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 500 ఎలక్ట్రిక్ బస్సుల్లో సికింద్రాబాద్ రీజియన్‌కు 400 బస్సులు కేటాయించారు. అందులో 111 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటివరకు అందుబాటులోకి వచ్చాయి. ఇంకా 289 బస్సు లు రావాల్సి ఉన్నవని అధికారులు తెలిపారు.